క్లుప్తంగా

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆఫీస్ అసిస్టెంట్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్ కోర్సులపై ఇంటర్, డిగ్రీ చదివిన యువతీ యువకులకు ఉచితంగా మూడు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ప్రిన్సిపాల్ కెఎస్ఎస్ రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, డిప్లొమో, బీటెక్ చదివిన యువతీ, యువకులకు డాటా అనాలసిస్ అసోసియేట్, ఆర్ట్ ఇంటలిజెన్స్ అసోసియేట్ కోర్సులపై నాలుగు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉదోగ్య అవకాశాలు కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 82477 88247 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

భక్తిశ్రద్ధలతో వారాహీదేవి పారాయణ

ఏలేశ్వరం: వారాహీమాత అమ్మవారి నవరాత్రులు పురస్కరించుకుని పట్టణంలో శుక్రవారం మహిళలు పారాయణ నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని దుర్గాదేవి ఆలయం వద్ద మహిళలు విష్ణుసహస్ర పారాయణ, లలితాసహస్ర పారాయణ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, తూమురౌతు గురయ్య, ఉడతల రమణారావు, గుమ్మాల గిరిజ, ఇందిరా, మల్లేశ్వరి, కామాక్షి, మంగామణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు కిట్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచించారు. మండలంలోని యర్రవరం గ్రామంలో శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్స్‌ను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, పాల్గొన్నారు.

మహిళలకు అవగాహన కల్పించాలి

తుని రూరల్: మండలంలోని రాపాక గ్రామంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.వి.లక్ష్మణరావు పర్యటించారు. శుక్రవారం గ్రామంలో పర్యటించిన సీఈఓ తడి-పొడి చెత్త సేకరణ, పీఆర్ యాప్ నిర్వహణ, చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో మహిళలకు తడి -పొడి చెత్త సేకరణపై పారిశుధ్య అధికారులతో కలిసి అవగాహన కల్పించారు. గ్రామాలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలని, అందుకు గ్రామీణ ప్రజల సహకరం అవసరమన్నారు. ఎంపీడీఓ కె.సాయి నవీన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన చర్చి ప్రారంభం

జగ్గంపేట: జగ్గంపేటలోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి పేరిష్ నూతన మందిరం శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిధిగా జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ విచ్చేసి నూతన మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం మందిరంలో పలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘ సభ్యులు, చిన్నారులు, దైవజనులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ కాలేరు ఫీడర్ పరిధిలోని వెదురుమూడి గ్రామంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు రామచంద్రాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో నిర్వహించే ఆర్‌డీఎస్ఎస్ పనుల నేపథ్యంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం



ఆలయంలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

అన్నవరం: అన్నవరం రైల్వేస్టేషన్ రోడ్డులోని వెలసియున్న గ్రామదేవత శ్రీమరిడమ్మ తల్లి జాతర మహోత్సవాలలో భాగంగా శుక్రవారం ఘనంగా అన్నదానం నిర్వహించారు. స్థానిక వ్యాపారవేత్త వీర్ల సూరిబాబు దంపతుల విరాళంతో ఈ అన్నదానం చేపట్టారు. ప్రతీ ఏటా జ్యేష్ట అమావాస్య నాడు ఈ జాతర నిర్వహించి అనంతరం ఆలయం మూసివేస్తారు. మూడోరోజు ఆలయం తెరిచి అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. బుధవారం జాతర నిర్వహించి గురువారం ఆలయం మూసివేసి, శుక్రవారం అన్నదానం నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు, గ్రామస్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో అన్నప్రసాదం స్వీకరించారు.

ఉచిత విద్యకు తూట్లు

- గాలికి 25 శాతం ఉచిత సీట్ల నిబంధన
- గ్రామ సచివాలయాల్లో కనిపించని ఫ్లెక్సీలు, పోస్టర్లు
- ప్రైవేటు పాఠశాలల్లో ప్రచారం కరవు
- చట్టం అమలుపై విద్యాశాఖ అలసత్వం



ప్రత్తిపాడు ఎంఈవో కార్యాలయం

ప్రత్తిపాడు: ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అనేది విద్యా హక్కు చట్టం (RTE) ద్వారా అందుబాటులో ఉంది. ఈ చట్టం ప్రకారం, ప్రైవేటు పాఠశాలలు 25% సీట్లను ఆర్థికంగా వెనుకబడిన, లేదా బలహీన వర్గాల పిల్లలకు ఉచితంగా అందించాలి. ఈ అంశంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో విద్యాశాఖ అలసత్వం వహిస్తోంది. నిరుపేద విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునే విధంగా విద్యా హక్కు చట్టం ప్రకారం ఉచిత సీట్లు కేటాయించాలన్న నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. విద్యా హక్కు చట్టంలో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం మంది పేద విద్యార్థులకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలని 2012లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. కానీ నేటి వరకు ఏ పాఠశాలల్లోనూ ఈ చట్టాన్ని అమలు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి.

ఉచిత విద్యకు దూరం

విద్యాహక్కు చట్టం – 2009 సెక్షన్ 12(1)సీ ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఐదేళ్లు నిండిన విద్యార్థులకు 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాలను కల్పించాలి. కానీ విద్యాశాఖ నిర్లక్ష్యం, ప్రైవేట్ యాజమాన్యాల నిరాసక్తతతో క్షేత్రస్థాయిలో ఉచిత ప్రవేశాల కల్పన జరగడం లేదు. ఉచిత ప్రవేశాలపై పేదలకు కనీస అవగాహన కల్పించని కారణంగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలల్లో సుమారు 68 ప్రైవేటు పాఠశాలలున్నాయి. సుప్రీంకోర్టు తీర్పునను సరించి 1వ తరగతిలో ప్రతీ ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లను ఉచిత విద్య అందించేందుకు పేద విద్యార్థులకు కేటాయించాలి. కానీ ఏ ప్రైవేటు పాఠశాలల్లోనూ ఉచిత విద్య అమలు కావడంలేదు. గతంలో ప్రత్తిపాడు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి శ్రావణ్ కుమార్ ఉచిత విద్యపై కోర్టు పరిధిలోని ప్రైవేటు పాఠశాలలకు నోటీసులు జారీ చేశారు. అనంతరం ఆయన స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయడంతో ఆ ఊసే లేదు. ఇటీవల ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పలువురు తమ పిల్లలకు ప్రభుత్వం కల్పించిన ఉచిత ప్రవేశాలకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తిరస్కరించాయని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యను అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విధి విధానాలు

ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వం అనుమతించిన తరగతుల వారి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 25 శాతం ఉచితంగా చేరాలా అనుమతిస్తారు. వివరాలను ప్రభుత్వం సేకరించి ఆయా పాఠశాలల



ప్రభుత్వం రూపొందించిన ప్రచార పోస్టర్

ఫీజులకు అనుగుణంగా ప్రభుత్వం రీయింబర్స్ విధానంలో నిధులను జమ చేస్తారు.

అలసత్వం...

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయింపుపై గ్రామ సచివాలయాలు, నగర పంచాయితీ వార్డు, మండల స్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. పత్రికల్లో ప్రకటనలతో పాటు మండల విద్యాశాఖ కార్యాలయాల వద్ద ఫ్లెక్సీలు, గ్రామ సచివాలయాల వద్ద బ్రోచర్లు తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. పత్రికా ప్రకటలనకే పరిమితమై క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రచారం కల్పించడం లేదు. ప్రధానంగా ఈ ప్రవేశాల ప్రక్రియ పూర్తయ్యేవరకు నిరంతరంగా అవగాహన కల్పించాల్సి ఉంది. మండల స్థాయిలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలి. విద్యాశాఖ అలసత్వంతో పేదలకు అవగాహన లేక దరఖాస్తు చేసుకోవడం లేదు.

చట్టం అమలు చేయాల్సిందే



సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం పేదలకు 25 శాతం ఉచిత విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాల్సిందే. అధికారులు చిత్తశుద్ధితో చట్టాన్ని అమలు చేసి, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలి. లేకపోతే దీనిపై పెద్దఎత్తున ఉద్యమిస్తాం.

– కీర్తి మణికంఠ, మండల అధ్యక్షుడు (ఎస్ఎఫ్ఐ), ప్రత్తిపాడు

చర్యలు తీసుకుంటాం



విద్యాహక్కు చట్టాన్ని అమలు చేస్తాం. ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాల కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. నిబంధనల మేరకు ఉచిత ప్రవేశాలు కల్పించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తాం.

– వి రాజబాబు, మండల విద్యాశాఖాధికారి, ప్రత్తిపాడు

హక్కులను కాలరాస్తున్న కేంద్రం

జగ్గంపేట: పిఠాపురంలో జూలై 22వ తేదిన జరిగే ఎపిఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజినేయులు అన్నారు. జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో శుక్రవారం మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తు, కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కుతోందని విమర్శించారు. కార్మిక చట్టాలు, హక్కుల కోసం పిఠాపురంలో జరిగే మహాసభలో ప్రత్యేకంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోంటామని, సభలకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. రైతుకూలీ సంఘం నేతలు, పీడీఎస్‌యూ నేతలు, మహిళా సంఘం నేతలు పాల్గొన్నారు.

తడి-పొడి చెత్తపై అవగాహన



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ కాశీ విశ్వనాథం

ప్రత్తిపాడు: ప్రతీ ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్త వేరుచేసి, పారిశుధ్య కార్మికులకు అందజేయాలని డిప్యూటీ ఎంపీడీఓ కేవీవీ కాశీ విశ్వనాథం కోరారు. మండలంలోని చినశంకర్లపూడి గ్రామంలో శుక్రవారం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో తడి చెత్తను ఆకుపచ్చ డబ్బాలోనూ, పొడి చెత్తను నీలం డబ్బాలో వేయాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామస్తులతో అవగాహన సదస్సు నిర్వహించారు. వానాకాలంలో రోగాలు వ్యాప్తి చెందడానికి అవకాశం ఉన్నందున ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి బి.వీరబాబు, కస్తూరి తేజా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

చెరకు కాటాల్లో అసాంఘిక కార్యకలాపాలు



పాతకొట్టాంలో నిరుపయోగంగా ఉన్న చెరకు కాటా

కోటనందూరు: మండలంలోని చెరకు కాటాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. తాండవ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలో మొత్తం 12 కాటాలు (చెరకు సేకరణ కేంద్రాలు) ఉండగా ఒక్క కోటనందూరు మండలంలోనే ఆరు కాటాలున్నాయి. గత దశాబ్ద కాలంగా ఫ్యాక్టరీ మూత పడడంతో కాటాల పరిధిలో చెరకుసాగు కనుమరుగైంది. దీంతో మండలంలోని ఎస్సార్‌పేట, బొద్దవరం, కోటనందూరు, పాతకొట్టాం, కేఈ చిన్నయ్యపాలెం, అల్లిపూడి గ్రామాల్లో ఉన్న చెరకు కాటాలు మూతపడ్డాయి. కాటాల వద్ద రైతుల కోసం విశ్రాంతి షెడ్డులను కూర్చునేందుకు సౌకర్యవంతంగా, జనావాసాలకు దూరంగా గ్రామ పొలిమేర్లలో నిర్మించారు. దీంతో ఇక్కడ మందు, గంజాయి బాబులు తిష్ట వేసి రాత్రివేళల్లో హల్‌చల్ చేస్తున్నారని, పరిస్థితి అధ్వానంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. అధికార యంత్రాంగం కాటాలను పరిరక్షించకపోతే పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాటాలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యవసాయ శాఖ ఏడీగా గరిమెళ్ల శ్రీనివాస్



జగ్గంపేట: జగ్గంపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులుగా గరిమెళ్ల శ్రీనివాస్ శుక్రువారం భాద్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు ఏడీగా విధులు నిర్వహిస్తు జగ్గంపేటకు బదిలీపై వచ్చానన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు సహకారంతో రైతులకు సకాలంలో వ్యవసాయశాఖ నుంచి వచ్చే అన్ని ప్రయోజనాలు కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

రబీ ధాన్యం సొమ్ములేవి..?



ప్రత్తిపాడు తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీకేఎస్ జిల్లా సంఘ ప్రతినిధులు

ప్రత్తిపాడు: రబీ సీజన్ ముగిసి ఖరీఫ్ కూడ ప్రారంభమైంది..కానీ ఇంతవరకు ప్రభుత్వం రైతాంగానికి ధాన్యం సొమ్ములు చెల్లించనే లేదు. ఇలా అయితే రైతన్న పంట పండించేదెలా..పెట్టుబడులు పెట్టెదెలా..?అంటూ భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) సంఘ సభ్యులు ప్రశ్నించారు. ప్రత్తిపాడు వివేకవర్ధిని రైతు ఉత్పత్తిదారుల సంఘ కార్యాలయంలో శుక్రవారం బీకేఎస్ కాకినాడ జిల్లా ప్రతినిధుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిధిగా విచ్చేసిన రాష్ట్ర సంఘటనా కార్యదర్శి కొండబాబు మాట్లాడుతూ రబీ సీజన్‌లో ప్రభుత్వం సేకరించిన ధాన్యానికి సొమ్ములను వెంటనే రైతు ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలోని ఏపీ ఆయిల్ ఫెడ్‌ని ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. ప్రైవేట్‌పరమైతే రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని, ప్రభుత్వం పునరాలోచన చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కాలువలన్నింటినీ ఆధునీకరించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రతినిధులు ఆకుల హరిబాబు, కంపరపు నాగేశ్వరరావు, నీలగిరి చిట్టిబాబు, మాసిన రామసాయి, కాకిలేటి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన కల.. నిరీక్షణకు తెర



నిర్వాసితులకు ఇళ్లస్థలాలు కేటాయిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

- నిర్వాసితులకు స్థలాల కేటాయింపు
- 472 కుటుంబాలకు లాటరీ పద్ధతిలో అందజేత

తుని రూరల్: గత ఆరేడేళ్లగా పోలవరం ఎడమ కాలువ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయింపులు వాయిదా పడుతూ వస్తుంది. ఎట్టికేలకు స్థలాల కేటాయింపు వివాదాలకు తావివ్వకుండ శక్రవారం పూర్తయ్యింది. పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్వాసితులకు రెండు లే అవుట్లలో రెవెన్యూ అధికారులు ఇళ్ల స్థలాలు కేటాయించారు. తుని రోడ్లు భవనాలశాఖ అతిధి గృహం ఆవరణలో శుక్రవారం బహిరంగ లాటరీ పద్ధతిలో 472 కుటుంబాలకు ఇళ్ల స్థలాలను కేటాయించినట్టు తహసీల్దార్ జీవీఎస్.ప్రసాద్ తెలిపారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణంలో కుమ్మరిలోవ కాలనీకి చెందిన ఇళ్లను తొలగించేందుకు ప్రభుత్వం భూసేకరణ చేసింది. ఈ మేరకు ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు కుమ్మరిలోవ శివారు దుద్దికలోవ, చేపూరు వద్ద రెండు లేఅవుట్లు వేసి స్థలాలను సిద్ధం చేశారు. అందరి సమక్షంలో లాటరీ తీసి అర్హులందరికి పంపిణీ చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, విఆర్వోలు రాజేష్, నేతజీ, చినతల్లి పాల్గొన్నారు.



ఇళ్లస్థలాల కేటాయింపులో పాల్గొన్న నిర్వాసితులు

ఎంపీడీఓగా పూర్తి బాధ్యతల అప్పగింత

గండేపల్లి: ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన కె. చంద్రరావుకు శుక్రవారం పూర్తి బాధ్యతలు అప్పగించినట్టు సిబ్బంది తెలిపారు. గతంలో పనిచేసిన ఎంపీడీఓ ఎస్.బుజ్జి ప్రమోషన్‌పై బదిలీ కావడంతో నాటి నుంచి ఈయన ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్నారు. (ఫుల్ అడిషినల్ ఇన్‌చార్జ్) గా పూర్తి బాధ్యతలు అప్పగించడంతో సిబ్బంది, పలువురు నేతలు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కిర్లంపూడి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అనారోగ్యా బారిన పడకుండా గ్రామాల్లో పారిశుధ్యం కార్యక్రమాలు ముమ్మరం చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పెంట కుప్పలను తొలగించి, మంచినీటి వనరులు సురక్షింతంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డీఎంపీడీఓ సత్యప్రసాద్, సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.


టీడీపీలో మాలలకు ప్రాధాన్యం ఏదీ..?



తుని మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకర్

తుని: ఎస్సీ వర్గీకరణ పేరుతో గురు, శిష్యులైన చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డిలు మాల సామాజికవర్గంపై కుట్ర చేస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ ధ్వజమెత్తారు. శుక్రవారం తుని పట్టణంలో స్థానిక హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ మొదలు పెట్టిన పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో లేని కంగారు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఎందుకు వచ్చిందని, ప్రజాస్వామ్యంలో ఒక కులం, వర్గాన్ని టార్గెట్ చేయడం సమాజ శ్రేయస్సుకు మంచిదికాదన్నారు. టీడీపీలో మాల సామాజవర్గానికి చెందిన ఏ ఒక్కరికి పదవులు ఇవ్వకుండా, కేవలం 10 వేల మంది మాత్రమే ఉన్న మాల ఉపకులానికి మంత్రి పదవి ఇచ్చారన్నారు. విడిపోయిన ఆంధ్రప్రదేశ్‌లో 40 లక్షల మంది జనాభాతో ఉన్న మాల సామాజిక వర్గానికి పార్టీలో స్థానం ఎక్కడని ప్రశ్నిస్తున్నామన్నారు. మాల ఉపకులాలకు ఎస్సీ కార్పొరేషన్ పదవి ఇవ్వడం సంతోషమేనని, కాని మెజార్టీ వర్గమైన మాలలకు మీ పార్టీలో ప్రాతినిధ్యం అవసరం లేదాని సీఎం చంద్రబాబు నాయుడుని అడుగుతున్నానని, రాజ్యాధికారం వైపు దళితులు కన్నెత్తి చూడకుండా ఉండే కుట్రలో భాగంగా వర్గీకరణ ముసుగులో దళితుల ఐక్యతపై రాజకీయ పార్టీలు దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో కళ్యాణ్, సూరిబాబు, నానిబాబు, ప్రేమ్‌బాబు, సత్యనారాయణ, మోహనరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

తలుపులమ్మకు చీర-సారె సమర్పణ




తలుపులమ్మకు చీర-సారె అందిస్తున్న రాజా కుటుంబ సభ్యులు

తుని రూరల్: ఆషాఢమాసం తొలి శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని లోవ దేవస్థానంలో కొలువైయున్న తలుపులమ్మ అమ్మవారికి తుని రాజా కుటుంబీకులు చీర, సారె సమర్పించారు. ఆషాడ మాసోత్సవాలు సందర్భంగా ఎస్ఆర్‌వీవీ. శ్రీనివాసరాజు, పృధ్వీరాజ్, రమేష్‌రాజు కుటుంబ సమేతంగా లోవ ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు చేశారని కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. వేదపండితులు, ప్రధాన అర్చకులు ఆశీర్వదించగా ఈఓ శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. మాజీ కౌన్సిలర్ దంతులూరి శ్రీనివాసరాజు, దండెం నాగు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత వారోత్సవాలు

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి దివిస్ లేబరేటరీ పరిశ్రమంలో శుక్రవారం విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహించారు. విద్యుత్ పరికరాల వినియోగం పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక అవగాహన కల్పించారు. అనంతరం విద్యుత్తు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వి. నాగ శేఖర్. బి. వాసు బాబు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిపై ఎంపీడీఓ మండిపాటు



బెండపూడి గ్రామ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేశ్వరరావు

తొండంగి: బెండపూడి గ్రామ సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కాకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో బి.రాజేశ్వరరావు అన్నారు.. గ్రామ సచివాలయ సిబ్బంది తరచూ విధులకు గైర్హాజరావడం, సకాలంలో విధులకు హాజరు కాకపోవడం వంటి అంశాలపై గ్రామస్తులంతా మూకుమ్మడిగా ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ సచివాలయ సిబ్బందినీ ఎంపీడీవో కార్యాలయానికి పిలిపించి విచారణ చేశారు. ఇకపై సకాలంలో విధులకు హాజరు కాకుంటే షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆషాఢం సారె సమర్పణ



కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఆషాఢం సారెతో అన్నవరం దేవస్థానం ఈఓ

అన్నవరం: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైయున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న ఆషాఢ మాసోత్సవాల సందర్భంగా అమ్మవారికి అన్నవరం శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తరుపున దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు చీర, సారె సమర్పించారు. దేవస్థానం వేదపండితులు, అర్చకులు కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడలో సమర్పించారు. ఆలయ అర్చకులు, అధికారులు వారికి స్వామివారి ప్రసాదాలు, ఫొటోలు అందచేశారు.

గ్రామాల పరిశుభ్రతకు సహకరించాలి



మురారిలో పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గండేపల్లి: గ్రామాల పరిశుభ్రతకు ప్రజలంతా సహకరించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కె.చంద్రరావు సూచించారు. మండలంలోని మురారిలో శుక్రవారం పర్యటించి గ్రామస్తులకు పారిశుధ్యంపై పలు సూచనలు చేశారు. తడి-పొడి చెత్త సేకరణ, క్లోరినేషన్ నిర్వాహణపై సిబ్బందికి వివరించారు.

మాకు ఎన్నాళ్లీ కష్టాలు..!



పెద జగ్గమ్మ చెరువులో అధ్వానంగా మారిన చింత చెట్లు వీధి

గండేపల్లి: నీలాద్రిరావుపేటలోని పోలవరం కాలువకు సమీపంలోని చింత చెట్లు వీధి వర్షాలకు అధ్వానంగా మారింది. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి వీధిలో నీళ్లుచేరి రోడ్డు చిత్తడిగా మారిందని ద్విచక్ర వాహనదారులు జారి పడిపోయే పరిస్థితిని చవిచూస్తున్నామని, రాత్రి సమయంలో చాలా ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తున్నందున కనీసం కంకర అయిన వేయించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను స్థానికులు కోరుతున్నారు.

అధునాతన కమ్యూనికేషన్‌పై శిక్షణ

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో అధునాతన కమ్యూనికేషన్ అనే అంశంపై వారం రోజుల పాటు జరిగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శుక్రవారంతో ముగిసినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూ బి.లీలా కుమారి, డైరెక్టర్ ఆఫ్ అఫిలియేషన్ ఎన్.బాలాజీ కో-ఆర్డీనేటర్లుగా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రో.వైస్ చాన్సలర్ ఎస్.రమశ్రీ, విశాఖ ఆంధ్ర విశ్వకళాపరిషత్ ప్రొఫెసర్ జి.శశిభూషణ్ రావు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం అధిపతి సంజీవ్ కుమార్ పాల్గొని వైర్లెస్ కమ్యూనికేషన్ అనే అంశంపై ఉపన్యాసం ఇచ్చినటు పేర్కొన్నారు.